nipuna
Every Wednesday Free Supplement
05.
14 ఆగస్టు 2024
పేజీలు 8

## స్వియాటెక్

పోలెండ్ టెన్నిస్ క్రీడాకారిణి ఇగా స్వియాటెక్ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ విజేతగా నిలిచింది. పారిస్‌లో జూన్ 8న జరిగిన ఫైనల్లో జాస్మిన్ పాలిని (ఇటలీ)పై విజయం సాధించింది. స్వియాటెక్ వరుసగా మూడోసారి గెలిచి మొత్తంగా నాలుగోసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుని రికార్డు సృష్టించింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో స్వియాటెక్ (4) కంటే ముందు ప్లేయర్లు క్రిస్ ఎవర్ట్ (7), స్టెఫీగ్రాఫ్ (6), హెనిన్ (4) ఎక్కువ టైటిళ్లు సాధించారు. అదేవిధంగా పురుషుల సింగిల్స్ ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను స్పెయిన్ ఆటగాడు కార్లోస్ అల్కారజ్ గెలుపొందాడు.

# ప్రాచీన కాల ప్రాకారాలు.. ఆధునిక కాలానికి అద్భుతాలు

## భారతీయ చారిత్రక సాంస్కృతిక వారసత్వ సంపద- వాస్తుకళ




- భారతీయ చారిత్రక సాంస్కృతిక వారసత్వ సంపదగా వాస్తుకళకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. భారతీయ వాస్తుకళ నైపుణ్యం హరప్పా నాగరికత మొదలు నేటి వరకు వివిధ దశల్లో వికాసం చెందుతూ వస్తుంది. ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు ఒక్కో యుగంలో ఒక్కో రకంగా వాస్తుకళ తన ప్రత్యేకతను చాటుకున్నది.
- భారతదేశ చరిత్రలో మొదటి నాగరికత అయిన సింధూ నాగరికత పూర్తిగా పట్టణ నాగరికతగా అవతరించడం గొప్ప చారిత్రక అంశం. సాధారణంగా ప్రతి సమాజ నాగరికత మొదట ఆదిమ, గ్రామీణ స్థాయి నుంచి క్రమంగా పట్టణ స్థాయికి పరిణామం, వికాసం చెందుతుంది. కానీ భారతీయ నాగరికత మాత్రం ప్రారంభంలోనే పట్టణ నాగరికతగా ప్రారంభం కావడం ఆశ్చర్యకరం.
- సింధూ నాగరికతకు సంబంధించిన పురావస్తు ఆధారాలను బట్టి పరిశీలిస్తే నేటి ఆధునిక పట్టణ నిర్మాణాలు క్రీ.పూ.2500 సంవత్సరాల క్రితం నుంచే దేశంలో ఉన్నట్లు అర్థమవుతుంది. శాస్త్రీయంగా నిర్మించిన పట్టణాలు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, భవనాల నిర్మాణం, హరప్పా నాగరికత, వాస్తుకళకు నిదర్శనం. మొహెంజోదారోలో నిర్మించిన స్నానవాటిక సింధూ ప్రజల వాస్తుశైలికి ఒక ప్రతీక. సింధూ నాగరికత కాలం నాటి నిర్మాణాలకు కాల్చిన ఇటుకలను, సున్నం/జిప్సం వాడటం ఆధునికతలను తెలుపుతుంది.
- మౌర్యుల కాలంలో ముఖ్యంగా అశోకుని కాలంలో నిర్మించిన రాతికట్టడాలు మౌర్యుల వాస్తుకళకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలిచాయి. కొండలను తొలిచి గుహాలయాలను నిర్మించడం వంటి వాస్తుకళ నాగార్జునకొండ, బరాబర్, సీతామహర్షి వంటి గుహాలయాల్లో నేటికీ సజీవ నిర్మాణాలుగా ఉన్నాయి. అదేవిధంగా ప్రధాన నిర్మాణాల్లో స్థూపాలు, స్తంభాలను వినియోగించిన తీరు నాటి వాస్తుకళాకారుల సృజనాత్మకతకు ప్రతిబింబంగా ఉన్నాయి. గాంధార ప్రాంతంలో గ్రీకు రోమన్ వాస్తుకళల మిశ్రమంగా రూపొందిన గాంధార శిల్పకళలో బౌద్ధారామాలు, స్థూపాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఉత్తర భారతదేశంలో శాతవాహన రాజులు అమరావతి వాస్తుకళను అభివృద్ధి చేశారు. అమరావతి వాస్తుకళలో బౌద్ధ కట్టడాలైన గుహాలయాలు, స్థూపాలు, చైత్యాలు, విహారాలను కొండలను తొలచి నిర్మించారు.
- గుప్తుల కాలంలో వాస్తుకళ దేవాలయాలు, గుహాలయాలు, స్థూపాల రూపంలో వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రలోని అజంతా, ఎల్లోరా గుహలు, మధ్యప్రదేశ్‌లోని బాగ్ గుహలు, ఉదయగిరి గుహలు, అదేవిధంగా నగర శైలిలోని శిఖరాలను గర్భగుడిపై నిర్మించే వాస్తుశిల్పకళ గుప్తుల కాలంలో వికాసం చెందింది. ద్రావిడ వాస్తుకళ ఆధారంగా నిర్మించిన దేవాలయాలు, ముఖమండపం, అధిష్ఠానం అనే విభాగాన్ని కలిగి ఉంటాయి. విమానం పై భాగాన కలశం కొన్ని దేవాలయాల్లో నల్లశిలతో, మరికొన్ని దేవాలయాల్లో బంగారం లేదా వెండి పూతను కలిగి ఉంటాయి. స్తంభాలతో కూడిన మండపాలను దేవాలయ ప్రాంగణాల వల్ల నిర్మించే వాస్తుకళ ద్రావిడ ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది. దేవాలయాల నిర్మాణంలో గర్భగుడి చుట్టూ ప్రదక్షిణాపథం సర్వసాధారణంగా కనిపిస్తుంది. దక్షిణ భారతదేశంలో శాస్త్రీయ పద్ధతిలో నిర్దిష్టమైన క్రమశ్రేణిలో దేవాలయాల నిర్మాణానికి పునాదులు వేసిన పల్లవుల కాలంలో వాస్తుకళ గుహాలయాలైన మండపాలు, రథాల రూపంలో వ్యక్తమయ్యింది. పల్లవ నర్సింహవర్మ కాలంలో ఏకశిలా రథాలు రూపొందాయి. మహాబలిపురంలోని తొమ్మిది రథాలు పల్లవుల వాస్తుకళకు ప్రతీకగా నిలిచాయి. పల్లవుల కట్టడాల్లో వస్తువు, శిల్పం ఒకదానితో ఒకటి పూర్తిగా మేళవించి మానవ స్వరూపాలు రూపురేఖల్లో, వాస్తుపద విన్యాసాల్లో అమరావతి వాస్తురీతిని పోలి ఉండటం స్పష్టంగా కనిపిస్తుంది.
- చోళుల కాలంలో ద్రావిడ వాస్తుకళ అత్యున్నత దశకు చేరుకుంది. రాజరాజు నిర్మించిన తంజావూరు బృహదీశ్వరాలయం చోళుల వాస్తుకళకు ప్రతిబింబం. చోళ శిల్పాల్లో మానవతావాదం ప్రతిబింబిస్తుంది. శిల్పాల్లో సహజమైన, వివరణాత్మకమైన నగలు, దుస్తులు కనిపిస్తాయి. శిల్పాలు ప్రధానంగా గ్రానైట్‌తో రూపొందించారు. గంగైకొండ చోళపురం ఆలయంలో నటరాజు, భగీరథుని తపోఘట్టాలు చోళుల వాస్తుకళ నైపుణ్యానికి నిదర్శనాలు అని చెప్పవచ్చు.

ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపాన్ని, ప్రాంగణం చుట్టూ కోటగోడలను పోలిన ఉన్నతమైన ప్రాకారాలను నిర్మించే వాస్తుకళను విజయనగర రాజులు అభివృద్ధి చేశారు. ఆలయ నిర్మాణంలోని విమానం, గోపురాల పై భాగంలో ఇటుకలు వాడటం, స్థల పురాణం, స్థానిక చారిత్రక గాథలు. రామాయణ, మహాభారత, భాగవతాలను వివరించే కథావస్తువులుగా శిల్పాలను రూపొందించడం, ఒక స్తంభం చుట్టూ 14 లేదా 16 చిన్న స్తంభాలు నిర్మించడం వంటివి ప్రత్యేకతను సంతరించుకున్నాయి. హంపీలోని విఠలాలయ మండపంలోని స్తంభాలను మీటితే సప్తస్వరాలు వీనులవిందు చేయడం విజయనగర వాస్తుకళలో సాంకేతికతను, నైపుణ్యాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడతాయి.

- చాళుక్యుల కాలంలో బాదామి, ఐహోల్, పట్టడకల్‌లో నాగర, ద్రావిడ వాస్తురీతిలో నిర్మించిన దేవాలయాలు ఒకే చోట ఉండటం వల్ల ఈ రెండింటి లక్షణాల కలయికతో కూడిన నూతన శైలి అయిన వేసర శైలి ఆవిర్భవించింది. హొయసల వాస్తుకళారీతి మైసూర్ ప్రాంతంలో వికాసం చెందింది. బేలూరులోని చెన్నకేశవ ఆలయం, హాలేబీడులోని హొయసలేశ్వరాలయం హొయసల వాస్తుకళారీతికి ప్రతిబింబాలు. ఈ వాస్తుకళలో మొదట నక్షత్రాకారంలో ప్లాట్‌ఫామ్‌ను నిర్మించి దానిపై ఆలయాల నిర్మాణం చేపట్టారు. ఆలయ కుడ్యాల్లో కొన్నింటిపై వెలుతురు ప్రసరించడం, మరికొన్నింటిపై నీడ పడటం, శిల్పాల్లో ఆభరణాలు ఎక్కువగా ఉండటం, స్తంభాలు నల్ల బసాల్ట్ రాయితో రూపొందించడం, మెరుస్తుండటం వంటి లక్షణాలు హొయసల వాస్తుకళలో ప్రత్యేకంగా కనిపిస్తాయి.
- చాళుక్య వాస్తుకళను అనుసరించిన కాకతీయ వాస్తుకళలో దేవాలయాలు ఏక మందిరం, త్రికూటాచలం అనే రెండు రకాల నిర్మాణాలుగా కనిపిస్తాయి. రుద్రదేవుడు హనుమకొండలో నిర్మించిన వేయిస్తంభాల గుడి త్రికూటాచలం రకానికి ఉదాహరణ. ఈ దేవాలయంలో మూడు గర్భగృహాలుండి ఒక్కో గర్భగృహానికి ముందు ఒక్కో అంతరాళం ఉంటుంది. స్తంభాలపై నృత్య శిల్పాలు వివిధ భంగిమలో చెక్కి ఉన్నాయి. రామప్ప దేవాలయ నిర్మాణం కాకతీయుల వాస్తుకళా రీతికి సజీవ సాక్ష్యంగా కనిపిస్తుంది.
- ఖజురహో వాస్తుశైలిలో ఖజురహో దేవాలయాలు (మధ్యప్రదేశ్) ఎత్తయిన కట్టడాలపై నిర్మించారు. పరిపూర్ణ దశకు చేరిన ఖజురహో దేవాలయాల్లో అర్థమండపం, మండపం, మహామండపం, అంతరాళం, గర్భగుడి, ప్రదక్షిణా పథం, విమానంపై రెండు శిఖరాలు ఆలయ కుడ్యాన్ని సమాంతరంగా రెండు, మూడు భాగాలుగా విభజించిన తీరు విలక్షణంగా కనిపిస్తుంది. భువనేశ్వర్, పూరీ జగన్నాథ్, కోణార్క్ దేవాలయాలు కళింగ వాస్తుకళారీతికి నిదర్శనాలు.
- మధ్యయుగంలో భారతదేశానికి ఇస్లాం ప్రవేశంతో రెండు విభిన్న వాస్తుకళల మిశ్రమంతో నూతనంగా ఇండో-ఇస్లామిక్ వాస్తుశైలి ఆవిర్భవించింది. నిర్మాణాల్లో హిందూ వాస్తుకళకు సంబంధించిన బీమ్‌లు, స్లాబ్ నిర్మాణాలను ఇస్లాం వాస్తుకళకు సంబంధించిన కమానులు (ఆర్చ్‌లు), అర్ధగోళాల (డోమ్‌లు) వంటి నిర్మాణాల కలయికతో కూడిన మిశ్రమ వాస్తుకళను అనేక కట్టడాల్లో ఉపయోగించారు. హిందూ వాస్తుకళలో ఉపయోగించే మానవ మూర్తుల చిత్రాలు, జంతువులు, వృక్షాలు, పుష్పాలను ఇస్లామిక్ వాస్తుకళలో ఉపయోగించగా, ఇస్లామిక్ వాస్తుకళలోని డోమ్‌లు, ఆర్చ్‌ల వంటి నిర్మాణాలను హిందూ వాస్తుకళలో ఉపయోగించారు.
- కుతుబుద్దీన్ ఐబక్ నిర్మించిన కువ్వత్ ఉల్ ఇస్లాం, అల్లావుద్దీన్ ఖిల్జీ నిర్మించిన జమాత్ ఖానా మసీదు అలాయ్ దర్వాజా, గుంబజ్‌లలో గుజరాతీ వాస్తుశైలి ప్రభావం కనిపిస్తుంది. తుగ్లక్‌ల కాలంలో రాజప్రాసాదాలతో కూడిన కోటలను తుగ్లకాబాద్, దౌలతాబాద్‌లలో నిర్మించారు. లోడీ సుల్తానుల కాలంలో కట్టడాలను ఎత్తయిన పీఠాలపై, తోటల మధ్యలో నిర్మించారు.
- మొఘలుల వాస్తుకళలో పర్షియన్ వైభవం, హిందూ వాస్తుకళ అందం, అలంకరణలు రెండూ ప్రధానంగా కనిపిస్తాయి. పెద్ద ఉద్యానవనాల మధ్య భాగంలో సమాధులను నిర్మించే వాస్తుకళ మొఘలుల కాలంలో సర్వసాధారణంగా కనిపిస్తుంది. ఈ వాస్తుకళలో మరో ప్రత్యేకత కట్టడాల్లో బయటివైపు ఒకటి లోపలివైపు ఒకటి చొప్పున రెండు గుమ్మటాలుండే కొత్త నిర్మాణ పద్ధతి మొఘలుల కాలంలో వెలుగులోకి వచ్చింది. అక్బర్ నిర్మించిన ఆగ్రా కోట వాస్తుకళలో రాజపుత్ర దుర్గాల ప్రభావం కనిపిస్తుంది. ఫతేపూర్ సిక్రీలోని భవనాలు, రాజప్రాసాదాలు పరిణతి చెందిన వాస్తుకళకు నిదర్శనాలు.
- జహంగీర్ కాలంలో నిర్మించిన అక్బర్ సమాధి, ఇత్‌మాద్ ఉద్దౌలా సమాధి వంటి నిర్మాణాల్లో రాజపుత్ర శైలి ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. వీటి నిర్మాణంలో పూర్తిగా తెల్ల చలువరాయి ఉపయోగించడంతో పాటు వీటి గోడలను పిత్రాదురా పద్ధతిలో అలంకరించారు. షాజహాన్ కాలంలో భవన నిర్మాణ సామగ్రిలో, సాంకేతిక పద్ధతిలో, నిర్మాణ శైలిలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఎర్ర ఇసుకరాయి స్థానంలో చలువరాయి వాడకం మొదలయ్యింది. రంగు పెంకుల వాడకం క్రమంగా తగ్గింది. అదేవిధంగా దీర్ఘచతురస్రాలున్న నిర్మాణాలకు బదులుగా వక్రగీతలు, అవిచ్ఛిన్న విన్యాసం ఉండే వాస్తుశైలి వికాసం చెందింది. ఈ నూతన వాస్తుశైలి ఆధారంగా ఆగ్రాలోని తాజ్‌మహల్, ఎర్రకోటలోని దివాన్-ఇ-ఖాస్, జామా మసీదు, మోతీ మసీదు వంటి కట్టడాలు నిర్మించారు.
- మధ్యయుగంలో సుదీర్ఘకాలం పాటు కొనసాగిన ఇండో-ఇస్లామిక్ వాస్తుకళకు భిన్నంగా ఆధునిక యుగంలో బ్రిటిష్ వలస పాలన కాలంలో మరో మిశ్రమ వాస్తుకళ వెలుగులోకి వచ్చింది. పాలనావసరాలకు అనుగుణంగా, మత వ్యాప్తి లక్ష్యంగా నాటి ఇంగ్లండ్‌లోని వాస్తుకళకు అనుగుణంగా అనేక నిర్మాణాలను నిర్మించారు. కలకత్తాలోని సెయింట్ జాన్స్ చర్చి ఇంగ్లండ్‌లోని సెయింట్ స్టీఫెన్ చర్చిని పోలి ఉంటుంది. మద్రాస్‌లో నిర్మించిన కట్టడాల్లో ఇండో సార్సెనిక్ వాస్తుశైలి స్పష్టంగా కనిపిస్తుంది. లాహోర్‌లోని సెంట్రల్ మ్యూజియం, సెనెట్ హౌస్, కలకత్తాలోని విక్టోరియా మెమోరియల్ హాల్, ముంబైలోని గేట్ వే ఆఫ్ ఇండియా, ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మ్యూజియం వంటి నిర్మాణాలు భారతీయ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదకు సజీవ సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి.
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన (182 మీ.) సర్దార్ వల్లభాయ్ పటేల్ కాంస్య విగ్రహాన్ని వింధ్యాచల్, సాత్పూర పర్వత శ్రేణుల మధ్య సాధు-బెత్ దీవిలో ఏర్పాటు చేశారు. ఇది అమెరికాలోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ ఎత్తు కంటే రెండు రెట్లు పెద్దది. ఈ విగ్రహాన్ని పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో నెలకొల్పారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కార్పొరేషన్ ప్రణాళిక పరిధిలో ప్రజల నుంచి కూడా నిధులను సమకూర్చారు. ఈ విగ్రహం ఐక్యత, దేశభక్తి, సమ్మిళిత వృద్ధి, సుపరిపాలనకు సంబంధించి సర్దార్ పటేల్ దార్శనికతకు నిదర్శనంగా నిలవడంతో పాటు ఇంజినీరింగ్ మహాద్భుత నిర్మాణంగా గుర్తింపు పొందిన ఈ విగ్రహం తరతరాలకు ప్రేరణగా నిలువనుంది.

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా తెలంగాణ నూతన సచివాలయాన్ని నిర్మించారు. ఈ సచివాలయాన్ని ప్రధానంగా దక్కన్ కాకతీయ వాస్తుశైలి ఆధారంగా నిర్మించారు. ముఖద్వారంపై 32 గోపురాలు ఏర్పాటు చేశారు. బయటి పోడియం క్లాడింగ్ ఎర్ర ఇసుకరాయితో, సెంట్రల్ టవర్ రాజస్థాన్ లేత గోధుమ రంగు దోత్పూర్ ఇసుక రాయి క్లాడింగ్‌తో నిర్మించారు. సచివాలయ ప్రధాన ప్రవేశం తూర్పు వైపు ఉంది. రాజ్యాంగ నిర్మాత, చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు స్ఫూర్తి ప్రదాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును తెలంగాణ నూతన సచివాలయానికి పెట్టడంతో పాటు సచివాలయానికి సమీపంలో 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.
- త్యాగాల వంతెనపై పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ అమరవీరుల త్యాగాలు ప్రతిబింబించేలా భవిష్యత్తు తరాలకు వారి త్యాగాలను చాటి చెప్పేలా సచివాలయం ఎదురుగా తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం (అమరజ్యోతి)ను నిర్మించారు. ఇది దీపాకారంలో నిరంతరం వెలిగే జ్యోతి రూపంలో ఉంటుంది. అమరజ్యోతి నిర్మాణంలో కింది భాగాన 1969 తెలంగాణ ఉద్యమం మొదలు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు జరిగిన సంఘటనలను ప్రతిబింబించే విధంగా మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు.

**నూతనకంటి వెంకట్**
పోటీ పరీక్షల నిపుణులు
ఆర్గనైజింగ్ సెక్రటరీ
గ్రూప్-1 అధికారుల సంఘం
9849186827

